

ఆర్వోల నుంచి ధ్రువీకరణ పత్రాలు అందుకుంటున్న కొండా సురేఖ, కేఆర్ నాగరాజు, దొంతి మాధవరెడ్డి

# కాంగ్రెస్ అభ్యర్థుల విజయం

- వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని ఐదు నియోజకవర్గాల్లో గెలుపు
- విజేతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేసిన ఆర్వోలు

కాశీబుగ్గ, డిసెంబర్ 3: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని వరంగల్ తూర్పు, పశ్చిమ, వర్ధన్నపేట, నర్సంపేట, పరకాల నియోజకవర్గాల ఓట్లను ఆదివారం లెక్కించారు. ఉదయం నుంచి ఫలితాలు వెలువడే వరకూ ప్రతి రౌండ్ ఉత్కంఠ భరితంగా సాగింది. వరంగల్ తూర్పు నుంచి కొండా సురేఖ, వర్ధన్నపేట నుంచి కేఆర్ నాగరాజు, నర్సంపేట నుంచి దొంతి మాధవరెడ్డి, పరకాల నుంచి రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ నుంచి నాయిని రాజేందర్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థులుగా గెలుపొందారు. ఆర్వోలు విజేతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. నర్సంపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దొంతి మాధవరెడ్డి 19,376, పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డి 7,941 ఓట్లు, వరంగల్ పశ్చిమలో నాయిని రాజేందర్‌రెడ్డి 15,331, వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కొండా సురేఖ 15,652, వర్ధన్నపేటలో కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్.నాగరాజు 20,070 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.



ఎన్నికల సిబ్బందితో కలెక్టర్ సిక్తా పట్నాయక్

## ఎన్నికల విజయవంతానికి కృషి చేసిన వారికి కలెక్టర్ కృతజ్ఞతలు

హనుమకొండ, నవంబర్ 3: హనుమకొండ జిల్లాలో శాసన సభ ఎన్నికలను విజయవంతం చేసేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని పరకాల, వరంగల్ పశ్చిమ నియోజక వర్గాల పరిధిలో సజావుగా ఎన్నికలు నిర్వహించి, కౌంటింగ్ ప్రక్రియను పూర్తిచేసినట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన ఎన్నికల అధికారులు, సిబ్బంది, ప్రజలు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

## తురుకల సోమారం గ్రామ మసీదు ఏ బిలాల్ నూతన కార్యవర్గం

పర్వతగిరి, డిసెంబర్ 3: మండలంలోని తురుకల సోమారం గ్రామంలో మసీదు ఏ బిలాల్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సదార్‌గా సర్దార్ పాషా, అధ్యక్షుడిగా యాకూబ్ పాషా, ఉపాధ్యక్షుడిగా ఖాజాపాషా, కోశాధికారిగా ఎస్‌కే రబ్బాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు యాకూబ్ పాషా, బాబుమియా, సంధానీ, షఫీక్, అమీర్, ఇమ్రాన్, అర్షద్, నజీర్, ఖుర్బానీ, గోరేమియా, గోరె, అన్వర్, అబ్రార్, హమీద్, దావుద్ పాల్గొన్నారు.



రాజేంద్రప్రసాద్, శ్రీకాంతాచారి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న హనుమాన్‌నగర్ కాలనీవాసులు

## హనుమాన్‌నగర్‌లో రాజేంద్రప్రసాద్, శ్రీకాంతాచారికి నివాళి

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 3 : స్వాతంత్ర్య సమరయోధుడు, మొదటి రాష్ట్రపతి, భారతరత్న అవార్డు గ్రహీత బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి, తెలంగాణ మలి దశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి వర్ధంతిని ఆదివారం గ్రేటర్ 5వ డివిజన్‌లోని హనుమాన్‌నగర్ ఫేజ్-1 కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, మొట్ల మనోహర్, శ్రీనివాస్, కుమార్‌రెడ్డి, సిరిమల్లె ప్రవీణ్, మాదారపు ఉదయ్‌కిరణ్, రాజ్‌కుమార్, వెంకటేశ్, రవికిరణ్, సందీప్, వంశీకృష్ణ, వినోద్, అజయ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ‘పాడి’ గెలుపుతో ఊరూరా బీఆర్‌ఎస్ సంబురాలు



సంబురాలు చేసుకుంటున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

కమలాపూర్, డిసెంబర్ 3: హుజూరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా పాడి కౌశిక్‌రెడ్డి గెలుపొందడంతో మండలంలోని కమలాపూర్, ఉప్పల్, శనిగరం, గూడూరు, అంబాల, శ్రీరాంలపల్లి నేరెళ్ల, గోపాల్‌పూర్, వంగపల్లి, మర్రిపెల్లిగూడెం, మర్రిపెల్లి, కానిపర్తి, దేశరాజ్‌పల్లి, శంభునిపల్లి, భీంపల్లి, కన్నూరు, గుండేడు తదితర గ్రామాల్లో ఆదివారం బీఆర్‌ఎస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నాయి. బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి 16 వేలకు పైగా మెజార్టీతో విజయం సాధించారు. కౌశిక్‌రెడ్డి విజయం సాధించడంతో గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు డీజేలు పెట్టి నృత్యాలు చేస్తూ, పటాకులు పేల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా చందా కాంతయ్య జయంతి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ సీబీఐ డైరెక్టర్ మన్యం నాగేశ్వర్‌రావు

వరంగల్, డిసెంబర్ 3 : ఏవీవీ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు చందా కాంతయ్య, పోతన జయంతి ఉత్సవాలను ఆదివారం ఏవీవీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. సీబీఐ మాజీ డైరెక్టర్ మన్యం నాగేశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై చందా కాంతయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఎదుగుదలకు ఏవీవీ విద్యాసంస్థలే బాటలు వేశాయన్నారు. ఇక్కడ చదువుకున్న తాను క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదిగినట్లు తెలిపారు. ఏవీవీ విద్యాసంస్థల కరస్పాండెంట్ చందా విజయ్‌కుమార్ మాట్లాడుతూ తన తండ్రి చందా కాంతయ్య చూపిన బాటలో నడుస్తూ నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యా సంస్థలను ముందుకు తీసుకపోతున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు ఏవీవీ విద్యా సంస్థలు కల్పవృక్షంగా నిలుస్తున్నదన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, పాలక వర్గం శాశ్వత సభ్యులు చందా శ్రీకాంత్, అచార్య ఎస్‌వీఎన్ శర్మ, వద్దిరాజు వెంకటేశ్వర్‌రావు, చకిలం మదన్‌మోహన్, రాంరెడ్డి, మురళీమోహన్ పాల్గొన్నారు.

## ‘మల్లికాంబ’లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

హనుమకొండ, నవంబర్ 3: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ మల్లికాంబ మనో వికాసకేంద్రంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కేంద్రం నిర్వహకురాలు బండా రామలీల తెలిపారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ మానసిక దివ్యాంగులకు వైద్య పరంగా కావాల్సిన సహాయం అందించడంతోపాటు తనవంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన సామూహిక నృత్య ప్రదర్శనలు ఆకట్టున్నాయి. డాక్టర్ భార్గవి, సాయిలక్ష్మణ్, డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ పాండ్, డాక్టర్ సుప్రియ, బండా సదానందం, ప్రొఫెసర్ పద్మ, కోడం కల్యాణ్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.కృష్ణమూర్తి

## కేయూ అధికారులకు షోకాజ్ నోటీస్

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 3: కేయూ 2018-19 కేటగిరి-1 పీహెచ్‌డీ ప్రవేశాల్లో రాజనీతిశాస్త్ర విభాగంలో నేషనల్ ఫెల్లోషిప్, స్కాలర్‌షిప్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆఫ్ ఎస్టీ విద్యార్థి విభాగంలో బానోత్ ఇందిరకు పీహెచ్‌డీలో ప్రవేశం కల్పించే విషయమై తెలంగాణ హైకోర్టు కేయూ అధికారులకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఈ నెల 11 లోపు సమాధానం తెలపాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ సందర్భంగా బాధితురాలు బానోత్ ఇందిర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఫెల్లోషిప్ సాధించిన తనకు పీహెచ్‌డీ అడ్మిషన్ ఇవ్వకపోవంతో రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ అన్ రిజిస్టర్డ్ కేటగిరీలో దరఖాస్తు చేసుకోవడంతో మహిళా సాధికారితలో భాగంగా పీజీలో 73 మార్కులతో ఫెల్లోషిప్ పొందినట్లు పేర్కొన్నారు. గతంలో ఫెలోషిప్ పొందిన విద్యార్థులకు అప్పటి వీసీ ప్రొఫెసర్ సాయన్న అడ్మిషన్లు కల్పించారని, కానీ, తన ధ్రువపత్రాలను పరిశీలించిన అప్పటి అధికారులు రిజిస్ట్రార్‌కు పంపించగా అడ్మిషన్ ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికైనా హైకోర్టు ఆదేశాలతో తనకు పీహెచ్‌డీ అడ్మిషన్ కల్పించాలని ఆమె కోరారు.



వ్రతంలో పాల్గొన్న భక్తులు

## సనాతన సంప్రదాయాలను ఆచరించాలి

పోచమ్మమైదాన్, నవంబర్ 3: సనాతన సంప్రదాయాలను ఆచరిస్తూ, భారత జాతి ఉన్నతి, హైందవ ధర్మాన్ని గౌరవించాలని శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ త్రిపురనేని గోపీచంద్ అన్నారు. ములుగురోడ్డులోని సప్తధామంలో ఆదివారం వేయి మందితో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. సామూహిక వ్రతం, యజ్ఞం చేయడం వల్ల అనేక రేట్ల ఫలితం వస్తుందన్నారు. అమెరికాలో స్థిరపడిన ఘనాపాటి కృష్ణశర్మ, అనిల్‌శర్మ, శ్రీనాథ్‌శర్మ ఈ కార్యక్రమాన్ని చేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టీలు సాయినారాయణ, సోమారామయ్య, గందె ఉమాశంకర్, రాంరెడ్డి, సదాశివుడు, టీ ప్రసాద్, లాయక్ అహ్మద్ పాల్గొన్నారు.



రుద్రేశ్వరుడికి లక్ష పుష్పార్చన చేస్తున్న అర్చకులు, భక్తులు

## వేయిస్తంభాల రుద్రేశ్వరుడికి లక్ష పుష్పార్చన

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 3: చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వర స్వామి దేవాలయంలో కార్తీకమాసోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. డాక్టర్ కరుణాకర్-దీప్తి దంపతుల ఆధ్వర్యంలో విజయవాడ నుంచి తెప్పించిన లక్షపుష్పాలతో లక్షనామాలతో ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య రుద్రేశ్వరుడికి లక్షపుష్పార్చన నిర్వహించారు. కార్తీక సమారాధన దేవతావృక్షాల దగ్గర కార్తీక వనభోజనాలను నిర్వహించారు. సోమవారం లక్షతులసీ అర్చన నిర్వహించనున్నట్లు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు.

## శ్రీవారి సన్నిధిలో అఖండ హరినామ సంకీర్తన

శాయంపేట, డిసెంబర్ 3 : తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి సన్నిధిలో మండలంలోని గట్లకానిపర్తి శివాలయ భజన బృందం సభ్యులు ఆదివారం అఖండ హరినామ సంకీర్తన ఆలపించారు. కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షుడు గూడా వాసుదేవమూర్తిశర్మ, భక్తులు అశోక్‌కుమార్, రవీందర్, సంతోష్‌బాబు, శేష్‌కుమార్, సాంబమూర్తి, భిక్షపతి, రాంబాబు, మధుసూదన్, రమేశ్, సత్యం పాల్గొన్నారు.



సంకీర్తనలో పాల్గొన్న గట్లకానిపర్తి భజన బృందం